- బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం
- బీఆర్‌ఎస్ మెదక్ అభ్యర్థి ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి తండాల్లో ఘన స్వాగతం పలికిన గిరిజనులు

## మీ.. ఆడబిడ్డగా అడుగుతున్న

# ఆలోచించి ఓటేయండి


ప్రచార రథం నుంచి మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ అర్బన్/ మెదక్ రూరల్, అక్టోబర్ 27: 'ఆడబిడ్డగా అడుగుతున్న అభివృద్ధి కావాలా, అరాచకాలు కావాలో.. ఆలోచించి ఓటేయాలి.' అని బీఆర్‌ఎస్ మెదక్ నియోజకవర్గ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హవేలీ ఘనపూర్ మండలంలోని గంగాపూర్, శమ్నాపూర్, కొత్తచెరువు తండా, ఔరంగాబాద్ తండా, స్కూల్ తండా, లింగసాన్‌పల్లి తండా, బ్యాతోల్, పాతూరు గ్రామాల్లో పద్మాదేవేందర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రచారం చేయడానికి వెళ్తే కొట్లాటలు తీసుకొచ్చే నీచమైన సంస్కృతి మంచికాదన్నారు. పదేండ్ల నుంచి పోలీస్ స్టేషన్లలో కేసులు లేకుండా ప్రశాంతంగా ఉన్న మెదక్ నియోజకవర్గంలోకి ఎవరు వస్తే గొడవలు అవుతున్నాయే ప్రజలు గమనించాలని కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నదన్నారు. మైనంపల్లి హన్మంతరావు ఐదేండ్ల పాలనలో ప్రజలు నీళ్ల కోసం అరిగోసపడ్డారని గుర్తు చేశారు. ఆడబిడ్డల కోసం సీఎం కేసీఆర్ ఇంటింటికీ తాగునీటిని అందిస్తున్నారని, గ్రామాల్లో నీటి ఎద్దడి తీరిన తర్వాత ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బోర్లు వేయించడం విడ్డూరంగా ఉన్నదన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు సిలిండర్ ధరను రూ.1,200 పెంచగా, సీం కేసీఆర్ రూ.400కే సిలిండర్‌ను అందస్తామని మ్యానిఫెస్టోలో చేర్చినట్లు తెలిపారు. కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆరు నెలల్లోనే హామీలను తుంగలో తొక్కిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు మూడు గంటల కరెంటు ఇస్తే చాలు అంటున్నాడని, ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఎలక్షన్ కమిషన్ వద్దకు వెళ్లి రైతుబంధు ఆపేయాలని ఫిర్యాదు చేశారని వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో కరెంటు, నీళ్లు, రైతుబంధు బందు అవుతాయని ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు.


ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

### మెదక్‌లో 13 ఏండ్లు కనిపించని మైనంపల్లి..

13 ఏండ్లుగా మెదక్ నియోజకవర్గంలో కనిపించకుండాపోయి సడన్‌గా కొడుకు కోసం మెదక్ నియోజకవర్గానికి వచ్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నడని, ఆనాడు మెదక్ నాకు అవసరంలేదని మల్కాజిగిరికి వెళ్లిన హన్మంతరావుకు ఇప్పుడు మెదక్ ఎందుకోసం గుర్తుకువచ్చిందో ప్రజలు అర్థం చేసుకోవాలని మెదక్ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. ఆనాడు తెలంగాణ ఉద్యమంలో మేమేంతా జై తెలంగాణ అంటే మైనంపల్లి నై తెలంగాణ అని తెలంగాణకు అడ్డు పడలేదా.. అని ప్రశ్నించారు. కొడుకును ఎమ్మెల్యే చేయడానికి మైనంపల్లికి మెదక్ నియోజకవర్గం గుర్తుకువచ్చిందని రోహిత్‌కు హవేళీఘనపూర్ మండలంలో గ్రామాల పేర్లు, తండాల పేర్లు కూడా తెల్వదని ఎద్దేవా చేశారు.

### గ్రామాల్లో ఘనస్వాగతం..

ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు వెళ్లిన పద్మాదేవేందర్‌రెడ్డికి బ్యాతోల్, శమ్నాపూర్, గంగాపూర్‌తోపాటు గిరిజన తండాల్లో ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. పటాకులు కాల్చుతూ ర్యాలీ పొడవునా పూలు చల్లారు. మహిళలు పద్మాదేవేందర్‌రెడ్డికి మంగళ హారతులు, బతుకమ్మలు, గిరిజనులు సాంప్రదాయ నృత్యంతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యారెడ్డి, హవేళీఘనపూర్ జడ్పీటీసీ సుజాత, ఎంపీపీ నారాయణరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులున్నారు.

# బీఆర్‌ఎస్‌తోనే తండాల అభివృద్ధి

- తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిన సీఎం కేసీఆర్
- ఎమ్మెల్యే మాణిక్‌రావు, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి దేవీప్రసాద్

జహీరాబాద్, అక్టోబర్ 27: గిరిజనుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ తండాలను గ్రామ పంచాయతీలు చేసి, పోడు పట్టాలు పంపిణీ చేశారని జహీరాబాద్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి కొనింటి మాణిక్‌రావు తెలిపారు. శుక్రవారం మొగుడంపల్లి మండలంలోని జాడిమాల్కాపూర్, సజ్జారావుపేట తండా, పర్వతాపూర్, జంగర్‌బౌళితండా, మిర్జాంపల్లి తండా, హరిచందర్ నాయక్‌తండాలో ఎమ్మెల్యే, బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి దేవీప్రసాద్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఏర్పుల నరోత్తం, టీఎస్ఐడీసీ చైర్మన్ తన్వీరుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం తండాలను గ్రామ పంచాయతీలు చేసి అభివృద్ధి కోసం అధిక నిధులు మంజూరు చేశారన్నారు. ప్రతి గిరిజన తండాల్లో సీసీ రోడ్లు, మురికి కాల్వలు నిర్మాణం చేశారన్నారు. తెలంగాణ ప్రభుత్వం కొత్త పంచాయతీల్లో గ్రామ పంచాయతీ భవనాలు, విద్యార్థుల కోసం పాఠశాల భవనాలు నిర్మాణం చేసిందన్నారు. ప్రతి గిరిజన తండాను ఆదర్శంగా అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్ పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారన్నారు. తండాలకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు నిధులు మంజూరు చేశారన్నారు. పోడు భూముల్లో పంటలు సాగు చేసుకుంటున్న రైతులకు పోడు పట్టాలు పంపిణీ చేసి హక్కులు కల్పించారన్నారు. ప్రతి ఇంటికీ మిషన్ భగరీథ నీరు సరఫరా చేశారన్నారు. బీఆర్‌ఎస్ స్థానిక వ్యక్తికి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చిందని, శాసనసభ ఎన్నికల్లో ఓట్లు వేసి ఆశీర్వదించాలని కోరారు. సజ్జారావుపేటతండాలో సర్పంచ్, టెలికం బోర్డు సభ్యులు పవార్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి, పూల వర్షం కురిపించారు. గిరిజన మహిళలు తండాల్లో గిరిజన సంప్రదాయంతో స్వాగతం పలికారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు విజయ్‌మోహన్‌రెడ్డి, కుద్బొద్దీన్, శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌కుమార్, గోపాల్, సంజీవ్, వివిధ గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మొగుడంపల్లి మండలంలోని సజ్జారావుపేటతండాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు, చిత్రంలో నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి దేవీప్రసాద్ తదితరులు

### పస్తాపూర్ గ్రామాభివృద్ధికి కృషి

– రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్పుల నరోత్తం

పస్తాపూర్ గ్రామాభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసిందని, అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి చేస్తానని టీఎస్ఎస్సీడీసీ చైర్మన్ ఏర్పుల నరోత్తం తెలిపారు. శుక్రవారం జహీరాబాద్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన సమావేశంలో పస్తాపూర్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. గ్రామానికి చెందిన రాములు, చంద్రయ్య, నర్సమ్మ, కమలమ్మ, రంగమ్మ, శంకరమ్మ, తుల్జమ్మ, పారమ్మ, రాణేమ్మ, అభుషమ్మలతోపాటు పలువురు పార్టీలో చేరిన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సయ్యద్ మసూద్ హుస్సేన్, కవేలి కృష్ణ, గోపాల్, మాణిక్‌ప్రభుగౌడ్ తదితరులున్నారు.


బీఆర్‌ఎస్‌లో చేరిన పస్తాపూర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం

## ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి

# పద్మశాలీల మద్దతు

**పద్మశాలీల సంక్షేమానికి కృషి చేస్తానని హామీనిచ్చిన మహిపాల్‌రెడ్డి**

పటాన్‌చెరు, అక్టోబర్ 27: పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి నియోజకవర్గ పద్మశాలీ సంఘం మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం చేసింది. శుక్రవారం పటాన్‌చెరు పట్టణంలో పద్మశాలీ సంఘం నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గ పద్మశాలీ సంఘం ఏకగ్రీవంగా ఎమ్మెల్యేకు మద్దతు తెలుపుతూ తీర్మానం చేశారు. అనంతరం ఎమ్మెల్యేను కలిసి తమ నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పద్మశాలీ సంఘం తనకు మద్దతు ఇవ్వడంపై కృతజ్ఞతలు తెలిపారు. 60 ఏండ్లలో సాధించని ప్రగతిని దశాబ్దకాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసి చూపించిందన్నారు. సీఎం కేసీఆర్ సబ్బండ వర్గాల సంక్షేమం అమలు చేసి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన పద్మశాలీలకు గుర్తింపునిచ్చి ప్రోత్సహించిన ప్రభుత్వం తమదన్నారు. నియోజకవర్గంలోని పద్మశాలీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామన్నారు. గతంలో కాంగ్రెస్ నాయకులు నేత కార్మికులను అసలు పట్టించుకోలేదని గుర్తు చేశారు. రాయితీలు ఇవ్వకుండా, నిధులు కేటాయించకుండా ఇబ్బందులు సృష్టించారన్నారు. పరిశ్రమలను మూసివేస్తూ, సంఘాల నుంచి ఖరీదు చేయకుండా కార్మికులను రోడ్డుపాలు చేశారని విమర్శించారు. బీఆర్‌ఎస్ సర్కారు ద్వారా మంత్రి కేటీఆర్ పద్మశాలీలకు సముచిత స్థానం కల్పిస్తూ, వారిని అన్ని రంగాల్లో ముందంజలో నిలుపుతున్నారని కొనియాడారు. కార్మికులకు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అండగా నిలుస్తున్నారన్నారు. నేతన్నల కోసం తెలంగాణ సర్కారు చేనేత బీమా పథకాన్ని ప్రవేశపెట్టి వారి కుటుంబాలకు భరోసా ఇచ్చిందన్నారు. కార్మికులకు నూలు, రసాయనాలు, రంగుల్లో రాయితీలు ఇస్తూ నేరుగా వారి ఖాతాల్లోనే డబ్బులు జమ చేస్తున్నదని వివరించారు. సంఘాల్లో ఉన్న రూ. 10 కోట్ల విలువైన స్టాక్‌ను కూడా టెస్కో ద్వారా కొనుగోలు చేసినట్లు తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని పద్మశాలీలకు సైతం ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో పెద్దపీట వేశామన్నారు. వారి అభివృద్ధికి కృషి చేస్తానని, ఏ సమస్యతో వచ్చినా తక్షణం వాటిని పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వంగరి అశోక్, సీనియర్ నాయకులు మ్యాకం మల్లేశ్, పద్మశాలీ సంఘం ప్రతినిధులు వేముల రమేశ్, భాస్కర్, నర్సింలు, సోమదాసు, వీర నారాయణ, చిరంజీవి, నగేశ్, విట్టల్ రాజు, నాగభూషనం, వాసు, గుర్రం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి మద్దతు తెలుపుతున్న పటాన్‌చెరు నియోజకవర్గ పద్మశాలీ సంఘం ప్రతినిధులు